




నగరాభివృద్ధికి సమగ్ర బడ్జెట్

ప్రజాశక్తి-నెల్లూరు: నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించేలా సమగ్రమైన నూతన బడ్జెట్ ను రూపొందించాలని కమిషనర్ సూర్య తేజ అధికారులను ఆదేశించారు. నగర పాలక సంస్థ అన్ని విభాగాల ఉన్నతాధికారులతో బడ్జెట్ రూపకల్పన సమావేశాన్ని కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను నగరపాలక సంస్థకు బడ్జెట్ కేటాయింపులో భాగంగా అన్ని విభాగాల అధికారులను సమన్వయం చేసుకొని, వారి సలహాలు, సూచనలు తీసుకొని అందరికీ ఆమోద యోగ్యమైన బడ్జెట్ ను రూపొందించాలని సూచించారు. నగర ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు నూతన బడ్జెట్ లో ప్రాధాన్యత కల్పించాలన్నారు. నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు,యస్ .ఈ .రామ మోహనరావు,డీ.సీ.పీ.పద్మజ, మేనేజర్ ఇనాయతుల్లా, అకౌంటెంట్ పద్మజ, అన్ని విభాగాల ఉన్నతాధికారులు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ

సైదాపురం మైన్స్

సైదాపురం తెల్లరాయి మైన్స్‌ను దక్కించుకోవడానికి ఒక నాయకుడికి మేలు చేయడానికి ప్రభుత్వం కొన్ని వేల మంది లారీ డ్రైవర్లు, టిప్పర్లు, జెసిబి ఆపరేటర్లు, కూలీలు, పేద ప్రజలను ఆకలి కేకలు పెట్టించింది...కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలలు పైనే సాకులు చెబుతూ..కాలం గడిపేసింది. కోట్ల రూపాయల వ్యాపారాలు నిలిచిపోయాయి...గత ప్రభుత్వంలో మైనింగ్‌లో అవినీతి, అక్రమాలు జరిగాయని తెలుస్తోంది. అప్పట్లో సరిచేసి మైనింగ్ లీజులు ఇవ్వాల్సిన ప్రభుత్వం ఇప్పటి వరకు కాలయాపన చేసింది. అధికారపార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి వ్యాపారానికి సహకరించడానికే ఇంత ఆలస్యం చేసిందనే విమర్శలు వస్తున్నాయి.. ఇప్పటికీ నాలుగు సార్లు లీజుదార్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, సరుకు తమకే విక్రయించాలని డిమాండ్ చేశారని సమాచారం. దీనికి వారు ససేమిరా అనడంతో అనుమతులు ఇవ్వలేదని తెలుస్తోంది. మంత్రులు, పార్టీ ముఖ్యులను కలిసి లీజుదారులు అలసిపోయారు. ఈ రంగాన్ని నమ్ముకొని ఎన్నో ఏళ్లుగా జీవనం సాగిస్తోన్న సుమారు 10 వేల మంది కార్మికులు చెట్టుకొకరు..పుట్టకొకరు మిగిలిపోయారు..ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం చేతికెళ్లింది. అధికారపార్టీలోకి ఓ నాయకుడు ప్రభావం కోసం మా బతుకులు నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..

- ◆ఒక్క నాయకుడి కోసం 10 వేలమందికి శిక్ష
- ◆యజమానులకు బెదిరింపుల పర్వం
- ◆తొమ్మిది నెలల నుంచి నిరీక్షణ
- ◆కేంద్రం చేతిలోకి మైన్స్ అనుమతులు



సైదాపురంలో తొమ్మిది నెలలుగా నిలిచిన మైనింగ్

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సైదాపురం తెల్లరాయి మైన్స్‌కు ప్రపంచంలో మంచి గుర్తింపు ఉంది. వైసిపి ప్రభుత్వంలోనే దీనికి మంచి గిరాకీ రావడంతో అప్పట్లో ఆపార్టీ మంత్రులు, ఎంఎల్‌ఎలు, నేతలు అందిన వరకు దోచుకుతిన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా అడ్డదారిలో కోట్లకు కోట్లు కొల్లగొట్టారు. ఈ విషయంలో అప్పట్లోనే సిపిఎం కార్యాలయం జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మీ బాధలు తీరుతాయని స్వయంగా నారా లోకేష్ హామీ ఇచ్చారు. ప్రభుత్వం మారిన తర్వాత సైదాపురం ప్రాంతంలోని తెల్లరాయి మైనింగ్ యజమానులు సంబరాలు చేసుకున్నారు.తమ బాధలు తీరుతాయని, ఇక అంతా సంతోషమేనని ఆనందపడ్డారు. తొమ్మిది నెలలు గడిచిపోయింది. టిడిపి విజయంలో కీలక బాధ్యత పోషించి, భారీగా నగదు ఖర్చుచేశారని చెబుతోన్న ఓ ప్రజా ప్రతినిధికి ఆర్థికంగా సహకరించడానికే పెద్దఎత్తున పావులు కదిపారని సమాచారం. తనకు మైనింగ్‌కు ఎలాంటి సంబంధమూ లేదంటూనే వెనుక నుంచి చక్రం తిప్పారనే ప్రచారం సాగుతోంది. ఈ ప్రాంతంలో ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం, మరో వైపు మైనింగ్ లీజుదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి, చైనాతో వ్యాపారం చేయడానికి ప్రయత్నాలు జరిగినట్లు తెలుస్తోంది. ప్రజాప్రతినిధి తనకు ఎలాంటి సంబంధమూ లేదని ఎవరి మైన్స్ వారు చేసుకోవచ్చునని చెప్పారని తెలిసింది.. మనుబోలు వద్ద షెడ్డు నిర్మించారు. ఇదే క్రమంలో చిల్లకూరు ఏ5 హోటల్‌లో నాలుగు సార్లు మైనింగ్ లీజుదారులతో గోనుపల్లికి చెందిన ఓ వ్యక్తి, నెల్లూరుకు చెందిన మరో వ్యాపారులు బేరసారాలు జరిపినట్లు తెలిసింది. తక్కువ ధరకు తమకు తెల్లరాయి వినియోగించేలా చేసిన డిమాండ్‌ను లీజు దారులు చెప్పినట్లు సమాచారం. ఈ వ్యవహారం తేలకపోవడంతో ప్రభుత్వం మైనింగ్ లీజు విషయంలో ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. సైదాపురం, గూడూరు, పొదలకూరు ప్రాంతంలో 170 మైన్స్ ఉన్నాయి. ఇందులో 130 మైన్స్ అనుమతులుండగా, 40 మైన్స్ మాత్రం అటు, ఇటుగా చేసు కుంటుంది. ఇక్కడ నుంచి మైకా, ఫెల్డ్‌స్పార్, క్వార్ట్జ్, వర్మిక్యులైట్ తీస్తారు. లీజు రెన్యువల్ చేయాల్సి ఉండగా ఒప్పందాలు సరిగా లేకపోవడంతో నిలిచిపోయాయని తెలుస్తోంది. తొమ్మిది నెలల నుంచి మంత్రి కొల్లు రవీంద్ర, నారా లోకేష్‌తో పలుమార్పులు మైన్స్ లీజుదారులు కలిసినా అడుగు ముందు కుపడలేదు. ఒక్క నాయకుడి వ్యాపారం కోసం మా బతుకులు నాశనం చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ లారీ , టిప్పర్లు, జెసిబి డ్రైవర్లు, రాయి బయటకు తీసే కార్మికులు, చిన్న చిన్న వ్యాపారులు, ఫ్యాక్టరీలు, అందులో పనిచేసే కార్మికులు వారిపై ఆధారపడిన కుటుంబాలు సుమారు 10 వేల మంది వీధిన పడ్డారు. చేయడానికి పనులేక పస్తులుండడం తోపాటు, ఊరు వదిలి వెళ్లిపోయారు. చెట్టుకొకరు.. పుట్టకొకరు ఏదో కూలీ పనిచేసుకుంటూ కాలం వెళ్లబుచ్చుతున్నారు.

కేంద్ర ప్రభుత్వం చేతికి తాళాలు..!

నిన్నటి వరకు మైనర్ మినరల్స్ జాబితా కింద రాష్ట్ర ప్రభుత్వం చేతిలో ఉన్న అనుమతులు , ఇప్పుడు మేజర్ మినరల్స్ కింద కేంద్రం చేతిలోకి వెళ్లాయి. ఇకపై ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ పరిధిలో అనుమతులు పొందాల్సి ఉంటుంది. అమరావతి చుట్టూ తిరిగిన లీజుదారులు ఢిల్లీకి తిరగాలి. అక్కడ ఎవరికి పలుకుబడి ఉంటే వారి చేతికి లీజు దక్కే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం 20 సంవత్సరాలున్న లీజు ఇకపై 50 సంవత్సరాలకు పొందే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సర్వే నిర్వహించి, ప్రత్యేక జోన్‌గా నిర్ణయించకా అప్పుడు కేంద్రం అనుమతులిచ్చే అవకాశాలున్నాయి. ఇది ఎప్పటికీ పూర్తి అవుతుందనే ఆందోళన అందరిలో ఉంది.

నెల్లూరులో వాచ్‌మెన్‌గా ఉంటున్నా..

పెంచలయ్య ,కార్మికుడు



ఎన్నో ఏళ్లుగా మైనింగ్‌లో కార్మికుడుగా పనిచేస్తున్నా..ఎనిమిది నెలల నుంచి నిలిచి పోయింది. ఇక్కడ ఏం పని దొరక పోవడంతో నెల్లూరులోని అపార్ట్ మెంట్‌లో వాచ్‌మెన్‌గా ఉంటున్నాను. నాకు ఇద్దరు పిల్లలు, వారి చదువులు ఆగిపోయాయి. పిల్లలు నావద్దే ఉంటున్నారు. ప్రభు త్వం స్పందించి మైనింగ్‌లో ఉపాధి కల్పిస్తే మా ఊరుకు వెళ్లి మా పిల్లలను చదివించుకొని ఊరులోనే జీవనం సాగిస్తాను.

పనుల్లేక ఖాళీగా ఉంటున్నా..

పవన్ కళ్యాణ్ జెసిబి ఆపరేటర్



మాది సైదాపురం మైనింగ్ ఆధారంగానే ఎన్నో ఏళ్ల నుంచి ఉంటున్నాను జెసిబి ఆపరేటర్‌గా పనిచేస్తున్నాను. మైనింగ్ నిలిచిపోవడంతో బతుకు జీవనం చాల కష్టంగా మారింది. ప్రభుత్వం ఏదైనా నిర్ణయం తీసుకుంటే లేదంటే అందరం ఆకలితో ఉండాల్సిందే. మండలంలోని అందరి కార్మికుల పరిస్థితి ఇలానే ఉంది. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏదైనా చేస్తుందని ఆశపడ్డాం.

దళితులపై పెత్తందారుల దౌర్జన్యం హేయం

సిపిఎం జిల్లా కమిటీ ఖండన



మీడియాతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

ప్రజాశక్తి-నెల్లూరు

ఆత్మకూరు రూరల్ మండలం, మొరగళ్ల గ్రామ పరిధిలోని చెరువులో చేపలు పట్టుకొని జీవనం సాగిస్తున్న దళితులపై అదే గ్రామానికి చెందిన పెత్తందార్లు దౌర్జన్యానికి పాల్పడటం హేయమని, అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి చేపలు పట్టుకొనేందుకు వేసి ఉన్న వలలను తొలగించడం హేయమైన చర్య అని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అన్నారు. గురువారం సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డాక్టరు రామచంద్రారెడ్డి భవన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మురుగళ్ల చెరువులో చేపల రక్షణకు వేసుకున్న వలలను తొలగించడం వంటి దుర్మార్గ చర్యలను సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు.

ఆత్మకూరు రూరల్ మండలం మొరగళ్లలో నిరుపేద దళితులు 70 కుటుంబాల వారు పంచాయతీ అనుమతితో 2021లో ఆ గ్రామంలో ఉన్న చెరువు మత్స్యకార సొసైటీ ఏర్పాటు చేసుకొని పంచాయతీకి లీజు చెల్లించుకుంటూ చెరువులో చేపలు పట్టుకుని జీవిస్తున్నారన్నారు. ఐదేళ్లుగా సభ్యులు సొసైటీ నిబంధనలకు అనుకూలంగా సొసైటీని నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ ఏడాది సొసైటీ సభ్యులందరూ భాగాలు వేసుకొని సుమారు రూ.8 లక్షల విలువైన చేప పిల్లలను వదులుకొని ఉన్నారన్నారు. దీన్ని జీర్ణించుకోలేని ఆ గ్రామ అధికార పార్టీ అగ్ర కులాల వారు మంత్రి దగ్గరకు వెళ్లి మురగళ్ళ సొసైటీని రద్దు చేయాలని కోరారన్నారు. మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సొసైటీని రద్దు చేయడం కుదరదని చెప్పడంతో చేపల వల రక్షణకు వేసిన వలలను తీసేయాలని కొరారన్నారు. స్థానిక నాయకుల మాటలతో మంత్రి మత్స్యశాఖ జిల్లా అధికారులపై ఒత్తిడి తేవడంతో మత్స్యశాఖ జెడి సొసైటీ సభ్యులపై ఒత్తిడి తెచ్చి ఎలాగైనా వలలు తీసేయాలని సభ్యులను భయ భయభ్రాంతులకు గురిచేసే విధంగా వ్యవహరించారన్నారు. ఈ నేపథ్యంలో నెల 24 తేదీ వేకువ జామున 4 గంటలకు ముందస్తు సమాచారం లేకుండా చెరువు రక్షణ వలలను తొలగించడం అన్యాయమన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మంగళ పుల్లయ్య మాట్లాడుతూ గ్రామంలో గతంలో దళితులను చెప్పుతో కొట్టిన కేసులో ఆ గ్రామంలో అగ్రకులాలకు చెందిన వారిపై అట్రాసిటీ యాక్ట్ కేసు ఉందన్నారు. ఆ కేసును ఉపసంహరించుకోవాలని ఇటువంటి బెదిరింపు చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. .సిపిఎం జిల్లా కార్యదర్శి వారు సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు గారు మాట్లాడుతూ ఈ ఘటనపై ఎస్సీ ఎస్టీ కమిషన్, మానవ హక్కుల కమిషన్ సుమోటోగా స్వీకరించి కేసులు కట్టి వారి పైన చర్యలు తీసుకొని దళితులకు న్యాయం చేయాలన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

నెల్లూరు : మార్చి 1 నుంచి 17వ తేదీ వరకు జరగనున్న ఇంటర్ పరీక్షలలో నగరపాలక సంస్థ మున్సిపల్ జూనియర్ కళాశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచాలని మేయర్ స్రవంతి జయవర్ధన్ ఆకాంక్షించారు. కార్పొరేషన్ కార్యాలయం మేయర్ చాంబర్లో నగరపాలక సంస్థ మున్సిపల్ జూనియర్ కళాశాలల విద్యార్థులు 284 మందికి పరీక్షలకు అవసరమైన విద్యా సామాగ్రిని మేయర్ గురువారం పంపిణీ చేసారు. మేయర్ మాట్లాడుతూ పరీక్షల సమయంలో ఏలాంటి ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలను విజయవంతంగా ముగించాలని సూచించారు.

పొగాకులో అన్య పదార్థాల నివారణకు శిక్షణ

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు ఒకటో వేలం కేంద్రం పరిధిలోని చౌటపాలెం గ్రామంలో ఆకు రెలుపు, క్యూరింగ్, గ్రేడింగ్ , పొగాకులో అన్య పదార్థాల నివారణ వంటి అంశాలపై రైతులకు , సిబ్బంది కి గురువారం శిక్షణ ఇచ్చారు. వేలం నిర్వహణ అధికారి ఎమ్ కిరణ్ మాట్లాడుతూ అడుగు ఆకులు వదిలేసి పక్వానికి వచ్చిన వాటిని మాత్రమే రెలచాలన్నారు. ఆకు అల్లిక సమయంలో టార్పాలిన్ పట్టాలు విడిగా వాడాలని తెలిపారు. గ్రేడింగ్ సమయంలో బుట్టలను అందుబాటులో ఉంచుకొని అన్యపదర్థాలను అందులో వేయాలని చెప్పారు. బ్యారన్‌లో కురోమీటర్ వాడాలని, దీనివల్ల అగ్ని ప్రమాదాలను నివారించ వచ్చని తెలిపారు. బ్యారెన్ లో క్యరింగ్ సమయం లో తీసుకోవలసిన మెలుకువలు, జాగ్రత్తలు గురించి తెలిపారు. సీనియర్ గ్రేడింగ్ ఆఫీసర్ శివ కుమార్ మాట్లాడుతూ క్యూరింగ్ ల వారీగా పొగాకు మండెలు పెట్టుకోవాలన్నారు. ఈ ఏడాది గ్రేడ్ లు వారీగా మార్కెట్ ఉంటుంది కాబట్టి బేల్స్ కూడా అలానే కట్టుకోవాలి తెలిపారు. జిపిఐ మేనేజర్ శ్రీ లేఖ, పొగాకు బోర్డు సిబ్బంది, రైతులు ఉన్నారు.



క్యూరింగ్ అయిన పొగాకును పరిశీలిస్తున్న వేలం కేంద్రం అధికారులు

సర్వే పరిశీలన

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్ : మండలంలోని అమ్మవారిపాలెం గ్రామంలో జరుగుతున్న పి 4 సర్వేను ఎంపిడిఒ వెంకటేశ్వరరావు పరిశీలించారు. పి 4 సర్వేను వేగవంతంగా చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. చినలాటిరిపి, నాయుడుపాలెం సచివాల యాలను సందర్శించి అటెండెన్స్, రికార్డులను తనిఖీ చేశారు.

ప్రజాశక్తి -గుడ్లూరు : గుడ్లూరు రెండో సచివాలయం పరిధిలో ఉన్న గహ సముదాయాల్లో ను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పి 4 సర్వేని ఎంపిడిఒ వై వెంకటేశ్వరరావు గురువారం పరిశీలించారు సర్వేను వేగవంతం చేయాలని సూచించారు.

రోడ్డు మార్జిన్‌లో దుకాణాలు పెట్టొద్దు

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్ : గుడ్లూరులో ఆర్ అండ్ బి రహదారులకు సంబంధించిన రోడ్డు మార్జిన్ లో షాపులు, దుకాణాలు పెట్టొద్దని ఎంపిడిఒ వై వెంకటేశ్వరరావు గురువారం హెచ్చ రించారు గుడ్లూరు లోని మామిడి చెట్ల దగ్గర ఓ షాపు రోడ్డు మార్గంలోకి రావడంతో స్థానికులు ఫిర్యాదు మేరకు ఎంపిడిఒ అక్కడికి చేరుకొని పరిశీలించి రోడ్డు మార్జిన్ లోనుంచి సొంత స్థలంలోకి జరపాలని దుకాణదారుని హెచ్చరించారు.



దుకాణదారులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ

పేదలకు ఆహారం పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు : శీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ కందుకూరు వారి అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా గురువారం కందుకూరుకు చెందిన మస్తాన్ వలి కుమార్తె మోహసీన పుట్టినరోజు సందర్భంగా వారి సహకారంతో పాపా నాయుడు పేటలోని లక్ష్మీ నరసింహ అనాథ వద్ధాశ్రమంలో ఉన్నవారి మధ్య కేక్ కటింగ్ , మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. కందుకూరు పట్టణం కోవూరురోడ్ లో ఉన్న స్వర్ణ స్వయంకషి మానసిక దివ్యాంగుల ఆశ్రమంలోని పిల్లలకు సాయంత్రం అల్పాహారం పంపిణీ చేశారు. వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ రవ్వా శ్రీనివాసులు, దాతలు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి 'పర్వతరెడ్డి'పరామర్శ

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లా జైలులో ఉన్న వైసిపి సోషల్ మీడియా యాక్టివిస్ట్, గుంటూరు వైసిపి నాయకులు ఎ.శ్రీధర్‌రెడ్డిని ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పరామర్శించారు. గురువారం నగర నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి, ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నెల్లూరు సెంట్రల్ జైలుకు వెళ్ళి శ్రీధర్‌రెడ్డిని పలుకరించారు. ఆయన ఆరోగ్యానికి సంబంధించిన విషయాలను అడిగి తెలుసు కున్నారు. జైలులో సమస్యలు ఏమైన ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.జైలు లో ఉన్న పరిస్థితులు తెలుసుకొని అక్కడ జైలు సూపరెండెంట్ తో మాట్లాడారు.వయసు రీత్యా, ఆరోగ్య రీత్యా శ్రీధర్ రెడ్డి కి కొన్ని ఇబ్బందులు ఉన్నందున ఇబ్బంది రాకుండా చూడాలని కోరారు.

కుష్టు వ్యాధి నివారణకు చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎల్‌సిడిసి కార్యక్రమాన్ని జిల్లాలో పక్కాగా నిర్వహించామని, ఈ నేపథ్యంలో 28 మంది కొత్త వ్యాధిగ్రస్తులను గుర్తించామని జిల్లా కుష్టు, ఎయిడ్స్, టిబి అధికారి డాక్టరు ఎస్‌కె ఖాదరవల్లి అన్నారు. గురువారం నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాల యంలో కుష్టు వ్యాధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరిలో జరిగిన పురోగతిని సమీక్షించారు. ఇటీవల జరిగిన ఎల్సిడిసి ప్రోగ్రామ్ 28 మంది కొత్త వ్యాధిగ్రస్తులను కనుగొన్నారని తెలిపారు. సమీక్షలో డాక్టర్ సిహెచ్ .సురేంద్రబాబు డిఎన్‌ఎంఓ, ఫిజియోథెర నరసింహులు, మల్లమ్మ , ప్రసాదాచారి ఉన్నారు.

శనగలో తెగుళ్ల నివారణకు 'ప్రదర్శనా క్షేత్రం'

'కెవికె' శాస్త్రవేత్తల ప్రయోగంతో సత్ఫలితాలు



శాస్త్రవేత్తల ప్రయోగ ఫలితంగా పచ్చగా కనిపిస్తున్న శనగ పంట ఇది

ప్రజాశక్తి-కందుకూరు

జిల్లాలో రబీలో వర్షాధారంగా వేసే శనగ పంట సుమారు 57వేల హెక్టార్లలో సాగైంది. పంటలో చాలా ఏళ్ల నుంచి నేల ద్వారా సంక్రమించే ప్యూజేరియం, ఫైటోప్తెర వంటి శిలీంధ్రాలు కలిసే ఎండు తెగులు, మొదలుకుళ్ల తెగులు, వేరుకుళ్ల తెగుళ్ల చాలా సమస్యాత్మకంగా ఉంటూ మొక్కల సాంద్రత , దిగుబడులు తగ్గడం వంటి సమస్యలు ఎక్కువగా ఉంటున్నాయి. వీటికి పరిష్కారాలు తెలియక రైతులు రసాయనాలపైనే ఆధారపడి ఖర్చు ఎక్కువగా పెట్టేవారు. ఈ సమస్యను కందుకూరు కషి విజ్ఞాన కేంద్రం , వ్యవసాయ శాఖతో కలసి వివిధ గ్రామాలలో పొలాలను పరిశీలించి నేల ద్వారా సంక్రమించే తెగుళ్లుగా గుర్తించి వాటికి పరిష్కారాలను వలేటి వారి పాలెం మండలం, నందలపూర్ గ్రామంలో సురేశ్ రైతు పొలంలో డా.జి.ప్రసాద్ బాబు, సీనియర్ శాస్త్రవేత్త హెడ్, డా.ఐ.వెంకటేష్, సస్య రక్షణ శాస్త్రవేత్త కలసి ప్రదర్శనా క్షేత్రం నిర్వహించి మంచి ఫలితాలను సాధించారు. గత ఏడాది నవంబర్ నెలలో ఈ తెగుళ్లను సహజసిద్ధంగా నివారించే ట్రైకోడెర్మ విరిడే, సూడోమోనాస్ అనే 2 జీవ శిలీంధ్ర నాశినులను ఎకరాకు ఒక్కో లీటరు చొపున రైజోబియం, పి.ఎస్.బి. కె.ఎస్.బి అనే జీవన ఎరువులను ఒక్కో లీటరు చొప్పున 100 కిలోల మగ్గిన పేడ ఎరువు, 100 కిలోల వేపచక్క కు కలిపి 15 రోజులు నీడలో ఈ మిశ్రమంపై గోనె పట్టలు పరచి పలుచగా నీళ్ళు చల్లి మగ్గబెట్టి ఆఖరు దుక్కిలో తేమ వున్నపుడు ఒక ఎకరా పొలంలో సమానంగా ఈ మగ్గిన మిశ్రమాన్ని చల్లుకోవాలి. దీంతోపాటు విత్తనం విత్తే ముందు కార్బాక్సిన్ 37.5శాతం థైరమ్ 37.5శాతం డి.ఎస్. కలగలిపి వున్న విటావాక్స్ పవర్ అనే విత్తన శుద్ధి మందును కిలో విత్తనానికి 1.5 గ్రాములు కలిపి విత్తడం జరిగింది. ఈ చర్యల ఫలితంగా సురేశ్ రైతు పొలంలో అన్నీ రకాల నేల ద్వారా సంక్రమించే తెగుళ్లను తక్కువ ఖర్చుతో సమర్థవంతంగా అరికట్టి, మొక్కలు చనిపోవడాన్ని దాదాపు 98శాతం నివారించడం తో పాటు మొక్కల ఎదుగుదల, పూత, కాయ శాతం ఎక్కువగా వుంటూ ఆ గ్రామ రైతులందరిని ఆకర్షించడం జరిగింది. అదే ఈ మిశ్రమాన్నిపొలాల్లో దాదాపు 15 నుండి 30శాతం మొక్కలు తెగుళ్ళకు లోనయి చనిపోయి మొక్కల సాంద్రత గణనీయంగా తగ్గిపోయింది. సురేశ్ అనే రైతు ఆసక్తితో ముందుకొచ్చి కెవికె వారి సాంకేతిక సహకారంతో నూతన యాజమాన్య పద్ధతులు, సలహాలు సూచనలు అవలంబించడం వల్లే ఇది సాధ్య పడిందని తెలుపుతూ కేవీకే శాస్త్రవేత్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆ గ్రామంలో శనగ పండించే అందరూ రైతులు వచ్చే సీజన్‌లో ఈ విధానాన్ని తప్పకుండా తమ పొలాల్లో అవలంబిస్తామని తెలిపినట్లు సీనియర్ శాస్త్రవేత్త జి ప్రసాద్ బాబు కందుకూరులో వెల్లడించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలలో పరిశీలన

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించేందు కోసమే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ సూచించారు. మండలంలోని పేడూరులో పిఎసిఎస్ లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ దళారులను నమ్మి మోస పోకుండా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు. తేమ శాతం, మట్టి గడ్డలు లేకుండా నాణ్యమైన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ రైతులకు సూచించారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. కొనుగోలు చేసిన మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుందన్నారు. పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పీపీసీ సెంటర్ ను జాయింట్ కలెక్టర్ కార్తీక్ తనిఖీ చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. జిల్లా సహకార శాఖ అధికారి బి.గురప్ప, డిఎం సివిల్ స ప్లైస్ కార్పొరేషన్ అర్జున రావు, జిల్లా సప్లై ఆఫీసర్ అం కయ్య, మండల తహసీల్దార్ కష్ణ ప్రసాద్, పిఏసిఎస్ పిఐసి ప్రకాష్, ఎంఏఓ శిరీష రాణి, సీఈఓ పి.వి రమణ మూర్తి, ఎస్డిఎల్సిఓ ఆదినారాయణ, సీనియర్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, పేడూరు నరుకురు ఇస్కపాలెం విఏఒలులు, రైతులు గూడూరు నారాయణ, రైతు సంగం నాయ కులు గంగపట్నం రమణయ్య, ముత్యాల శ్రీనివాసులు, దేవుళ్ళ శ్రీనివాసులురెడ్డి, తిరువాళ్లూరు రామసుబ్బారెడ్డి, శీనయ్య, తలమంచి నాగేశ్వరరావు ఉన్నారు.




ధాన్యం కొనుగోలు కేంద్రంలో పరిశీలిస్తున్న జెసి

కార్యకర్తల సంక్షేమానికి తొలి ప్రాధాన్యం : ఇంటూరి

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు నియోజకవర్గం టిడిపి కార్యాలయంలో గురువారం ఆ పార్టీ ప్రతిష్టాత్మంగా నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి సంబంధించిన సభ్యత కార్డులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చేతుల మీదగా పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ టిడిపి కార్యకర్తల సంక్షేమానికి తొలి ప్రాధాన్యత నిస్తున్నట్లు తెలిపారు.దేశంలో ఏ పార్టీకి లేనివిధంగా కోటి సభ్యత్వాలు కలిగిన ఏకైక పార్టీ టిడిపి అన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి,టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఎంతో కషి చేస్తున్నారని తెలిపారు. ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే వారి కుటుంబానికి అండగా ఉండేందుకు 5 లక్షల రూపాయల ప్రమాద బీమా కల్పిస్తున్నట్లు తెలిపారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం ,గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, కందుకూరు పట్టణ తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు, షేక్ రఫీ ,చదలవాడ కొండయ్య ,చిలకపాటి మధుబాబు, ముచ్చు శ్రీను, వడ్డేళ్ల రవిచంద్ర, పొడపాటి మహేష్, చుండూరి శ్రీను, షేక్ సలాం ,ముచ్చు వేణు, మధిర మధు, పులి నాగరాజు ఉన్నారు.



పిడికిటి వెంకటేశ్వర్లుకు సభ్యత్వం కార్డు అందజేస్తున్న ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు

జనన, మరణాల నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాలో జనన, మరణాలకు సంబంధించిన పూర్తి వివరాలను ఎప్పటికప్పడు ఆన్‌లైన్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఉపసంచాలకులు ఎం.శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి వి. సుజాత ఛాంబర్‌లో పలు విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులనుద్దేశించి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉపసంచాలకులు ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి కార్యక్రమం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకొనేలా సమిష్టి కృషి చేయాలని సూచన చేశారు. ఆసుపత్రిలో బిడ్డ పుట్టిన వెంటనే ఆధారు నమోదు చేసి శిశుఆధార్, జనన ధృవీకరణ పత్రం జారీ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. డెమో కె.కనకరత్నం, స్టాటికల్ ఆఫీసర్ కాకుమాని సహన, డిప్యూటి ఎస్ఓ మల్లికార్జున, డిపిహెచ్ఎన్ఓ మంజుల, డిపిఓ రమేష్, ఏఎస్ఓ రమేష్ మణికంత, డిపిఏ ప్రత్యూష ఉన్నారు.



రోడ్లను పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యతేజ


రోడ్ల మరమ్మతుల పనులు వేగవంతం

ప్రజాశక్తి-నెల్లూరు

నగరపాలక సంస్థ పరిధిలో అన్ని డివిజన్లో చేపడుతున్న రోడ్ల మరమ్మతు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కమిషనర్ సూర్య తేజ అధికారులను ఆదేశించారు. పారిశుద్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 23వ డివిజన్ పోలేరమ్మ చెట్టు సెంటర్, బ్యాంకు కాలనీ, అనగుంట ప్రాంతాలలో కమిషనర్ గురువారం పర్యటించారు. డివిజన్ పరిధిలో వివిధ ప్రాంతాలలో రోడ్లపై గుంతలు, పాట్ హెూల్స్ గుర్తించిన కమిషనర్ వెంటనే సరి చేయవలసిందిగా ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. రోడ్డుపై ఉన్న భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించేందుకు సంబంధిత భవన యజమానులకు నోటీసులు జారీ చేయాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం స్థానిక రామ్మూర్తి నగర్ అన్న క్యాంటీన్ ను కమిషనర్ సందర్శించారు. క్యాంటీన్లో ప్రజలకు అందిస్తున్న ఆహార నాణ్యతను తనిఖీ చేసి కమిషనర్ ప్రత్యక్షంగా అల్పాహారం తిని చూశారు. స్థానిక డివిజన్ కార్పొరేటర్ శ్రీనివాసులరెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ రామ్మోహన్ రావు, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేషగిరిరావు, వెటర్నరీ డాక్టర్ మదన్ మోహన్, అడిషనల్ డేట్ డైరెక్టర్ హార్టికల్చర్ ప్రదీప్ కుమార్ ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-నెల్లూరు : రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీహరి పుష్కర్ భారత్ గ్యాస్ వారి సహకారంతో గురువారం, బుజబుజనెల్లూరులోని డి.వి.ఎన్.ఎం. జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సాక్ష్యం కార్యక్రమంలో భాగంగా క్లీన్ ఎన్విరాన్మెంట్ త్రూ గ్రీన్ అండ్ క్లీన్ ఎనర్జీ అనే కార్యక్రమాన్ని నిర్వహించి తొమ్మిదవ తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి మొదటి మూడు బహుమతులు, ప్రోత్సాహక మూడు బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి పీ.హెచ్.పీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించడానికి అందరూ బాధ్యత వహించాలన్నారు. పరిశుభ్రమైన ఇంధనం యొక్క ఆవశ్యకత గురించి, ప్రజలు ఆ ఇంధనాన్ని వాడే విధానం గురించి అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఆయిల్ కంపెనీలతో భాగ స్వామ్యమై నిర్వహించేటువంటి సాక్ష్యం కార్యక్రమంలో భాగంగా ఈరోజు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, శ్రీహరి పుష్కర్ భారత్ గ్యాస్ ప్రోప్రైటర్ ఎం.సునీత లక్ష్మి, కె.రాంబాబు, పాఠశాల హెచ్ఎం మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు అచ్యుత మణి, పి.హెచ్.పి కోశాధికారి దేవరకొండ శ్రీనివాసులు ఉన్నారు.



సర్వేకు ప్రజలు సహకరించాలి

ప్రజాశక్తి-నెల్లూరు

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలో వార్డు సచివాలయ కార్యదర్శుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ రకాల సర్వేలకు ప్రజలంతా సహకరించి సరైన వివరాలను తెలియజేయాలని అదనపు కమిషనర్ వై ఓ నందన్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రజల ఆర్థిక ప్రగతికి, మరింత మెరుగైన సంక్షేమాన్ని అందించేందుకు రూపొందించిన ఎం.ఎస్.ఎం.ఈ సర్వే, పి4 సర్వే, ఆధార్ నమోదు చేసుకొని చిన్నారుల సర్వే, వర్క్ ఫ్రం హెూం సర్వేల నిర్వహణలో గడపగడపకు వార్డు సచివాలయ కార్యదర్శులు సందర్శించి ప్రజలను వివరాలు అడుగు తారని, వారికి సరైన వివరాలను అందించి, సర్వేను విజయవంతంగా పూర్తి చేసేందుకు తోడ్పడాలని అదనపు కమిషనర్ ఆకాంక్షించారు.



మాట్లాడుతున్న అదనపు కమిషనర్ నందన్

జెవివి వైజ్ఞానిక ప్రదర్శనలు

ప్రజాశక్తి-కావలి:కావలి పట్టణ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అధ్యక్షులు తోట. వెంకటేశ్వర్లు అధ్యక్షతన గురువారం రెడ్ క్రాస్ భవన్‌లో ఉత్తేజ ఉత్సాహంతో కొనసాగుతున్న జాతీయ సైన్స్ దినోత్సవ పోటీలలో భాగంగా వైజ్ఞానిక ప్రదర్శన (సైన్స్ ఎగ్జిబిట్స్)లు విజయవంతంగా ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 28 వ తేదీ దేశవ్యాప్తంగా జరుపుకునే జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా కావలి పట్టణ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 21 నుండి 26 తేదీ వరకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, సందేశాత్మక పాటలు, వ్యక్తిగత, బృంద నృత్య పోటీలు జరిగాయి. గురువారం ఉదయం 10.00 గంటల నుండి " వైజ్ఞానిక ప్రదర్శనల " పోటీ జరిగింది. వర్కింగ్ మోడల్స్ ను 6,7 తరగతులు జూనియర్ విభాగంలో , 8,9,10 తరగతులు సీనియర్ విభాగంలో నిర్వహించారు. 26 స్కూల్స్ నుండి 32 ప్రదర్శనలు పోటీకి వచ్చాయి. కావలి పట్టణంలోని వైద్యులు డా. బి. రమ్య, డా. జి . మాలిని,డా . ఈ. వెంకటేష్ , డా . ఎం.వి.లక్ష్మీనారాయణమ్మ , డా. అనూషారెడ్డి, ఈ ప్రదర్శనలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. జనవిజ్ఞానవేదిక గౌరవాధ్యక్షులు ,డా. బెజవాడ. రవికుమార్ మాట్లాడుతూ " సైన్స్ దినోత్సవ పోటీల నిర్వహణ విద్యార్థుల్లో శాస్త్రీయ చైతన్యం పెంపొందించడానికే అన్నారు. జెవివి సభ్యులు,గాయకులు , ఎస్ . రామచంద్రయ్య ,ఎస్ .రమణయ్య జనవిజ్ఞాన వేదిక సందేశాత్మక గీతాలను ఆలపించి ఉత్సాహాన్ని కలిగించారు. తోట . వెంకటేశ్వర్లు , ప్రధాన కార్యదర్శి గాదిరెడ్డి. హరనాథ్, కోశాధికారి, టి.సుబ్బారావు శర్మ ,రెడ్ క్రాస్ చైర్మన్ డి . రవిప్రకాష్, సి.కల్యాణ్, కందుకట్ల.నారాయణ తదితర సభ్యులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-కావలి: రత్నమ్మ ఫౌండేషన్ అధ్యక్షులు ఎంవిఎస్ ప్రసాదరావు ఆధ్వర్యంలో విశ్వోదయ ఉన్నత పాఠశాలలో వివిధ పాఠశాలలలోని 8, 9,10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఇంగ్లీష్ గ్రామర్ టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతులు పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో.. ముఖ్య అతిథిగా కావలి ఏరియా హాస్పిటల్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ కర్నాటి రోహిత్, అధ్యక్షులుగా విద్య"స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షులు షేక్. ఖాదర్ బాషా, విశ్వోదయ కరెస్పాండెంట్ డి.వి.రమణయ్య, మెషుల్ శిరాజ్ బేగ్, రఘునందనరావు ప్రభాకరయ్యారు. వక్తలు ప్రసంగిస్తూ అంతర్జాతీయస్థాయిలో అనుసంధాన భాష ఇంగ్లీష్ చక్కగా మాట్లాడాలంటే ఇంగ్లీష్ వ్యాకరణాన్ని అభ్యసించాలన్నారు ... పదముల ప్రయోగాన్ని సాధన చేయాలన్నారు. ప్రసాద్ రావు సతీమణి కీర్తిశేషులు రత్నమ్మగారిపై వ్యయప్రయాసలతో, ఆంగ్లం, గణిత శాస్త్రం లలో విద్యార్థులకు టెస్ట్ లు నిర్వహించి విద్యార్థులకు ఇటువంటి మంచి కార్యక్రమాలు చేస్తు ప్రైజెస్, ప్రశంసా పత్రాలిస్తు ప్రోత్సాహిస్తున్నారన్నారు. వారికి అభినందనలు తెలుపుతున్నామని, నేటి బాలలే రేపటి భావి భారత పౌరులన్నారు. ఇటువంటి మంచి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, ఎక్కడదన్న విరాజిల్లు తుందో! అక్కడ అభివృద్ధి తాండవిస్తుందన్నారు..విద్యతో వస్తుంది వివేకం! వివేకం తెస్తుంది సౌభాగ్యం!అన్నారు. సంగమాలు, సలహాలు ఇవ్వడమైనది.మొదటి ప్రైజ్ 90శాతం మార్కు లతో ఇద్దరికి.సి హెచ్. దివ్యాంజలి ,8వ వార్డు మునిసిపల్ ఉన్నత పాఠశాల, ప్రణీత్, నలంద ఉన్నత పాఠశాల కావలి,రెండవ ప్రైజ్ ఎండి.నిహాల్ 86శాతం మినర్వ ఉన్నత పాఠశాల కావలి మూడవ ప్రైజ్ ఇద్దరికి 84శాతం శాంతి వర్ధన్, హెచ్.జస్వంత్, జయఉష, పొందారు.





ప్రజా సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి:బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా టిడిపి కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. నెల్లూరు మాగుంట లే అవుట్ లోని విపిఆర్ నివాసంలో కోవూరు నియోజకవర్గ పరిధిలో"ప్రధానమంత్రి అను సూచిత్ జాతి అభ్యుదయ యోజన" పథకం ద్వారా ఎంపికైన 16 మంది ఎస్‌సి సోదర సోదరీమణులకు 35 లక్షల రూపాయల చెక్కులు అందచేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ సామాజికంగా వెనుకబడ్డ ఎస్‌సి సోదర సోదరీమణులను ఆర్థికంగా ఆదుకునేందుకు కేంద్రంలోని కూటమి ప్రభుత్వ సహకారంతో రాష్ట ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టిందన్నారు. బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తూ మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం అని ఆచరణలో నిరూపిస్తున్నారని ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కొనియాడారు. స్వయం ఉపాధి కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులను కోరారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ నాగరాజ కుమారి, పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాల్ రెడ్డి, టిడిపి మండల నాయకులు ఇంతా మల్లారెడ్డి, బత్తుల హరికృష్ణ, ఎంవి శేషయ్య, రావెళ్ల వీరేంద్రనాయుడు, బెజవాడ వంశీ కృష్ణా రెడ్డి, అడపాల శ్రీధర్ రెడ్డిలతో పాటు నియోజకవర్గ పరిధిలోని వెలుగు సిసిలు పాల్గొన్నారు.

పథకాలు రైతులకు చేరాలి

ప్రజాశక్తి-కోవూరు:కోవూరులోని శాంతినగర్లోని పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో గురువారం కోవూరు పశు సంవర్ధక శాఖ సబ్ డివిజన్ పరిధిలోని రెండు మండలాలకు సంబంధించిన పశు వైద్యులు, పశు సహాయకులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ కృష్ణమౌర్య మాట్లాడుతూ 'మార్చి 1నుంచి 30వ తేదీ వరకు కోవూరు పశు సంవర్ధక శాఖ సబ్ డివిజన్ పరిధిలోని రెండు మండలాల్లో ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరుగుతుందని, దీనికి పాడి రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా పశు సంవర్ధక శాఖ ద్వారా ప్రభుత్వం అందించే పథకాలు పాడి రైతులకు అందించేలా పశు సహాయకులు ప్రత్యేక దష్టి పెట్టాలన్నారు. ప్రస్తుతం కోవూరు పశు సంవర్ధక శాఖ సబ్ డివిజన్ పరిధిలోని రెండు మండలాల్లో అఖిల భారత పశు గణన 95 శాతం పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన 5 శాతం కూడా సకాలంలో చేపట్టేలా సర్వే బందం చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశు వైద్యులు డాక్టర్ వాణి శంకర్, డాక్టర్ షబానా, డాక్టర్ ప్రీతి సాల్మన్, లైవ్ స్టాక్ అసిస్టెంట్ సజ్జాద్ అహ్మద్, పశు సహాయకులు ఉన్నారు.

సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-ఎఎస్‌పేట:మండలంలోని జమ్మువవరం గ్రామంలో సోమశిల జలాలను, సైడ్ కాలువలు తీసి అక్రమంగా దిగువ ఉన్న రైతులకు నీటిని తరలింపు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు అన్న శీర్షికతో వెలువడిన వార్తకు స్పందన లభించింది. ఈ సందర్భంగా జమ్మువరం గ్రామ రైతులు మాట్లాడుతూ...ప్రజాశక్తి పత్రికలో వెలువడిన వార్తను చూసి నీటిపారుదల శాఖ ఎస్ఇ, డిఇ అధికారులు యథావిధిగా మట్టి వేసి పూడ్చి, మట్టి తీసిన 10 గంటల సమయంలో పై ఎట్లా ఉన్న కాలువ అలాగే చేసే విధంగా కృషి చేసినందుకు గాను పత్రికాముఖగా ధన్యవాదాలు తెలియజేశారు. ధన్యవాదాలు తెలిపిన వారిలో ప్రధానంగా ఆ గ్రామ టిడిపి నాయకులు పైడి శ్రీనివాసులు, మక్కిన వెంకటేశ్వర్లు, చల్ల వెంకటేశ్వర్లు, మక్కిన చిన్న మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

2న ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-కావలి:స్థానిక రామ్మూర్తి పేటలోని షిర్డీ సాయి బాబా మందిరంలో మార్చి 2 వతేది ఆదివారం రోటరీ క్లబ్ కావలి వారి ఆధ్వర్యం లో "సుశీల నేత్రాలయ "వారి ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిం చడం జరుగుతుందని రోటరీ క్లబ్ బాధ్యులు తెలిపారు.ఈ శిబిరం లో కంటికి సంబంధించిన అన్ని వైద్య పరీక్షలు ఉచితం గా నిర్వహిస్తారన్నారు. అవసరమైన వారికీ ఉచితంగా ఆరోగ్య శ్రీ కార్డు పై కంటి ఆపరేషన్లు చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని కావలి డివిజన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కావలి రోటరీ క్లబ్ సభ్యులు ప్రాజెక్టు చైర్మన్ కే. మాధవ రెడ్డి, ఎస్.స్వర్ణలత, మొగల్ సలీం బేగ్ కోరారు.

వ్యాపారాలతో పాటు సేవలూ చేయాలి

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

చట్టబద్ధమైన వ్యాపారాలతో పాటు ప్రజలకు సేవ కూడా చేయాలని ఎంఎల్ఎ ప్రశాంతి రెడ్డి పిలుపు నిచ్చారు.స్థానిక బాంబే రోడ్డు సెంట్రల్ లైటింగ్ డివైడర్‌లో తేజ డెవలపర్స్ వారి ఆధ్వర్యంలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమ నిర్వహించారు.ఈకార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తేజ డెవలపర్స్ వారు ఇటీవల కాలంలో 2 కోట్ల రూపాయల వ్యయంతో మార్కెట్ వ్యాపారస్తులకు నూతన మార్కెట్ కాంప్లెక్స్ ను అందించేందుకు సిద్ధపడడమే కాకుండా 600 మొక్కలను సెంట్రల్ లైటింగ్ డివైడర్ మధ్య నాటేందుకు సిద్ధపడి వాటిని సంరక్షించే బాధ్యతను కూడా వారే తీసుకోవడం ఎంతో గొప్ప విషయం మన్నారు.రియల్ ఎస్టేట్ వ్యాపారులే కాకుండా చట్ట ప్రకారం వ్యాపారాలు చేసే ప్రతి ఒక్కరూ ప్రజా సేవకు సిద్ధపడా లన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు ప్రభుత్వ నిబంధనలు ఉన్నంతవరకే వారి లేఅవుట్లలో వ్యాపారాలు కొనసాగించ చాల న్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో దూసుకు పోతున్న తేజ డెవలపర్స్ వారికి వారు చేస్తున్న సేవలకు గాను ఆమె కృతజ్ఞతలు తెలిపారు. వారిని ఆదర్శంగా తీసుకొని పలు వ్యాపారస్తులు ప్రజలకు సేవ చేసేందుకు మంచి హృదయంతో ముం దుకు రావాలని కోరారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్ పర్సన్ మోర్ల సుప్రజా, వైస్ చైర్మన్లు సుకుమార్ రెడ్డి, నస్రీంఖాన్, పట్టణ అధ్యక్షులు ఎంవి శేషయ్య, రూరల్ అధ్యక్షులు బత్తల హరికృష్ణ, పలువురు కౌన్సిలర్లు, చింతా శ్రీనివాసులు రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న ఎంఎల్ఎ ప్రశాంతిరెడ్డి

అసత్య ఆరోపణలు మానుకోవాలి

ప్రజాశక్తి-కావలి.

బడుగు బలహీన వర్గాలకు అండగా ఉండే ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ పై కొంతమంది దుష్ప్రచారం చేయడం సరి కాదని బిసి ఐక్యత భవన్ అధ్యక్షుడు ఆదూరి ప్రభాకర్ గురువారం పేర్కొన్నారు. స్థానిక బిసి ఐక్యత భవన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు అండ దండలు గా నిలిచిన ఉదయగిరి శాసన సభ్యులు కాకర్ల సురేష్ పై కొంతమంది కావాలని దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గం అభివృద్ధి లేక ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్న సమయంలో కాకర్ల సురేష్ ట్రస్ట్ ఏర్పాటు చేశారన్నారు. నియోజవర్గ ప్రజలకు ఎన్నో సేవలు చేసి ప్రజల్లో మంచి పేరు తెచ్చుకొని అతి చిన్న వయసులోనే శాసన సభ్యుడు ఎన్నికై ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నా రన్నారు. ప్రజల్లో మంచి పేరు ఉన్న కాకర్ల సురేష్ పై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని పూర్తిస్థాయిలో బీసీ ఐక్యత భవన్ ఖండిస్తుందని తెలిపారు. ఉన్నత విద్య చదువుకొని అమెరికాలో ఉద్యోగంలో స్థిరపడి , సొంత నియోజకవర్గానికి ఎంతో సేవ చేయాలని ముందుకొచ్చిన మంచి వ్యక్తిని, ఉదయగిరి ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ 5 కోట్లు మంజూరు చేసి కొత్త భవన నిర్మించిన వ్యక్తి, ప్రజల్లో మంచి పేరు ఉన్న ఉదయగిరి శాసన సభ్యులు కాకర్ల సురేష్ ని అవినీతి నిందలు సరికాదన్నారు.మెట్ట ప్రాంతాన్ని సిరుల గిరి గా అభివృద్ధి చేయడమే ఎమ్మెల్యే ధ్యేయం బలమైన నాయకత్వం కలిగిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్.తప్పుడు 'ప్రచారాన్ని అభివృద్ధితో సమాధానం చెబుతామన్నారు. నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఉదయగిరి శాసన సభ్యులు కాకర్ల సురేష్‌లు ప్రజాసేవకు అంకితమై, తమ సొంత నిధులను వెచ్చించి కోట్లాది రూపాయలతో ప్రజలకు సంక్షేమం అభివృద్ధి ఫలాలను అందించిన దాతలు వారు అని కొనియాడారు.కార్యక్రమం లో ప్రధాన కార్యదర్శి చిన్ని వర ప్రసాద్, మధు, రామయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బిసి ఐక్యత నాయకులు

టైలర్స్ డే ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కావలి.

టైలర్స్ డే సందర్భంగా కావలి టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యం లో "టైలర్స్ డే" ను ఘనంగా జరు పుతున్నామని, ఈ కార్యక్రమాన్ని కావలి పట్టణంలో ఉన్నటువంటి టైలర్లు అందరూ తరలొచ్చి జయప్రదం చేయాలని కావలి టైలర్ అసోసియేషన్ బాధ్యులు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని స్థానిక జర్నలిస్టు క్లబ్‌లో కావలిటైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. రమేష్, సెక్రటరీ షేక్ రెహమాన్, ట్రెజరర్ పి వేణు, సలహాదారులు షేక్ రఫీలు మాట్లాడుతూ కావలి టైలర్స్ అసోసియేషన్ ఏర్పడి 32 సం వత్సరాలు అయిన సందర్భంగా వార్షికోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం ఉదయం 9గంటల కు ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుంచి ర్యాలీగా బయలుదేరి ఏవీఎస్ కళ్యాణ్ మండపం వరకు జరుగునని తెలిపారు.అనంతరం టైలర్స్ డే సభ జరుగునని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు , కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, జనసేన పార్టీ కావలి ఇన్‌ఛార్జ్ అలహరి సుధాకర్ పాల్గొంటా రన్నారు. ఆర్‌డిఒ వంశీకృష్ణ, డిఎస్‌పి శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్ ,పాల్గొంటారని తెలిపారు. 45ఏళ్లకే పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో టైలర్స్అసోసి యేషన్.సభ్యులు అల్తాఫ్, రెహమాన్, రసూల్, జమీర్, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టైలర్స్ నాయకులు



పేర్లు నమోదు చేసుకుంటున్న అధికారులు

ఉపకరణాలకు 46 మంది వికలాంగులు ఎంపిక

ప్రజాశక్తి-కావలి:స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం వికలాంగులకు క్యాంపు ఏర్పాటు చేసి వారికి అవసరమైన పరీక్షలు నిర్వహిం చడమైనది. ఈ క్యాంపునకు సుమారు 120 మంది అభ్యర్థులు హాజరయ్యారు.ఈ 120 మందిలో 46 మంది వారికిఉపకరణాలు తప్పనిసరిగా అవసరమైనందున జిల్లా అధికారులు వారి పేర్లు నమోదు చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగింది. సదరు లబ్ధిదారులకు ప్రకటించిన తేదీలో వారికి సంబంధించిన అవసరమైన ఉపకరణాలు పంపిణీచేయడం జరుగుతుందని అసిస్టెంట్ డైరెక్టర్ హయ్యుమ్ తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా నుంచి సంధ్యారాణి, డి.దేవి, వెంకటాచలం, రామాంజనేయులు, శతి పాల్గొన్నారు.

పది విద్యార్థుల గృహాల సందర్శన

ప్రజాశక్తి - ఉదయగిరి:మండల పరిధిలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల బిజ్జంపల్లి, దేకూరు పల్లి, అయ్యవారిపల్లి 10వ తరగతి విద్యార్థుల గృహాలను ప్రధానోపాధ్యాయులు షేక్. నాయబ్ తన బృందంతో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గురువారం గృహాలను సందర్శిస్తూ తల్లిదండ్రులను కలసి విద్యార్థుల అభ్యసన గురించి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇళ్ల వద్ద వారి పట్ల తీసుకోవాల్సిన ప్రత్యేక శ్రద్ధ గురించి వాకబు చేశారు. కార్యక్రమంలో పాఠశాల సహోపాధ్యాయులు కృష్ణయ్య బ్రహ్మయ్య, ఖాజా అలీ పాల్గొన్నారు.

మురుగు నీటిని తొలగించండి సారూ..

ప్రజాశక్తి-ఎఎస్‌పేట :మండలంలోని ఏఎస్ టలో మహల్ వీధిలో రోడ్డుపై చేరినటువంటి మురుగు నీటిని తొలగించాలని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత వారం నుంచి రోడ్డుపైన మురుగు నిలబడిన దృశ్యాలను, సంబంధిత పంచాయతీ అధికారులకు, మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి పి.ప్రసన్నకుమారిలకు వీడియోలను పంపించా మన్నారు. పంచాయతీ సిబ్బంది రోజు వచ్చి చూసి పోతున్నారే తప్ప ఎలాంటి సాహసోపేత నిర్ణయాలు తీసు కోకుండా వెళ్లిపోతున్నారన్నారు.ఇకనైనా సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

1న శాస్త్రీయ సలహామండలి సమావేశం

ప్రజాశక్తి-మర్రిపాడు:కృషివిజ్ఞాన కేంద్రం, నెల్లూరు లో మార్చి 1న శాస్త్రీయ సలహామండలి సమావేశం జరుగుతుందని కె.వి.కె. సమన్వయ కర్త డా. జి. లలిత శివ జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమా వేశంలో రైతులు పాల్గొని వివిధ పంటలలో గల సమస్యలను శాస్త్రవేత్తలతో చర్చించి సలహాలు సూచనలు తెలుసుకోవాలని కోరారు.


మహిళ మెడలో గొలుసు చోరీ

ప్రజాశక్తి-కోవూరు:బాడుగ ఇల్లు కావాలంటూ ఇద్దరు కిలేడీలు స్కూటీపై వచ్చి పాటూరు తదితర ప్రాంతాల్లో గురువారం సాయంత్రం గంటపాటు తచ్చాడుతూ. ఓ మహిళ కళ్లల్లో కారం కొట్టి మెడలో బంగారు చైన్ లాకెళ్లిన సంఘటన. పాటూరురోడ్డు ప్రాంతంలో గురువారం సాయంత్రం సంచలనం కలిగించింది. నెల్లూరుకి చెందిన గూడపాటి వాసవి. దార్ల జీవన దీప్తి లు గురువారం సాయంత్రం స్కూటీపై బుర్కా వేసుకుని కోవూరు లోని పాటూరు రోడ్డు ప్రాంతానికి వచ్చారు. ఈ సందర్భంగా వారు పలు ప్రాంతాల్లో బాడుగకుఇల్లు కావాలంటూ పలు ప్రాంతాల్లో వాకబు చేశారు. తీరా ఓ ప్రతిపక్ష పార్టీకి చెందిన ఓ నేత మాతృమూర్తి బాబుతో ఆడుకుంటూ ఇంటి బయట ఉండగా వీరి ఇరువురు మాటలు మాట్లాడి ఆమె కళ్లల్లో కారం కొట్టి మెడలోని చైన్ ను లాక్కొని పరారీ అయ్యారు. చుట్టుపక్కల ప్రాంతాల వారు వాడిని కోసం ఆరా తీయగా స్కూటీపై వెళ్తుంటే వాసవి అనే అమ్మాయిని స్థానికులు స్కూటీ తో సహా పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మరో అమ్మాయి మాత్రం పరారీ అయింది. ఈ మేరకు పోలీసులు పారిపోయిన మరో అమ్మాయి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు.



శివాలయంలో పూజలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆత్మకూరు పట్టణంలోని , శివాలయం, కాశి నాయన ఆశ్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించడం అందరికీ తెలిసిన విషయమే అయితే శివరాత్రి నాటి అర్ధరాత్రి 12 గంటల సమయం అనంతరం లింగోద్భవ పూజ చేయడం ఆనవాయితీ అందులో భాగంగా అన్నపూర్ణ సమేత, విశ్వేశ్వర ఆలయంలో శివలింగానికి వివిధ రకాల ద్రవ్యాలైన పాలు, పెరుగు, తేనె, నెయ్యి, చెరకు రసం కొబ్బరి నీరు , చక్కెర , వట్టివేరు నీళ్ళ, తదితర ద్రవ్యాలతో ఏక రుద్రాభిషేకం నిర్వహించారు. ఆత్మకూరు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సిఐ గంగాధర్ , ఎస్ఐ జిలానీలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొం టారని ఎక్కడికక్కడ ట్రాఫిక్ ను కంట్రోల్ చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ ను కంట్రోల్ చేశారు.




మృతదేహం ఉన్న దృశ్యం

మహిళ మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-ఉదయగిరి:కనిపించని పువ్వాడి ధనలక్ష్మి (55) స్థానిక ట్యాంక్ బండ్ లో మృత దేహమై గురువారం లభ్యమైంది. పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని గొల్లపాలెంకు చెందిన ధనలక్ష్మి కుటుంబ కలహాల నేపథ్యంలో బుధవారం సాయంత్రం నుంచి కనిపించడం లేదని భర్త వెంకటాద్రి స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి దర్యాప్తు చేపట్టగా వారి దగ్గర ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో మొబైల్ ఆనకట్ట సమీపంలో ఉన్నట్లు గుర్తించారు. దాంతో గురువారం ఉదయం నీటిలో తేలియా డుతున్న డెడ్ బాడీని స్థానికుల సమాచారంతో గుర్తించా మన్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి కుటుంబ సభ్యుల నుండి పూర్తిస్థాయిలో వివరాలు సేకరించి పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శరవేగంగా పెట్రోల్ బంక్ పనులు

ప్రజాశక్తి-కోవూరు :కోవూరు మండలం ఇనమడుగు గ్రామ ంలో పడుగుపాడు స హకార సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న పెట్రోల్ బంక్ పనులను గురువారం సొసైటీ సిఇఒ గోవర్ధనరెడ్డి నిశితంగా పరిశీలించారు. చేపట్టే పనుల్లో తప్పనిసరిగా నాణ్యతా ప్రమాణాలు ఉండాలన్నారు. సాధ్యమైనంత త్వరలో చేపట్టే పనులు పూర్తి చేసేలా సంబంధిత కాంట్రాక్టర్ చొరవ తీసుకోవాలన్నారు. ఈ పరిశీలనలో ఆయన వెంట సొసైటీ ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు.


రిక్షాలు ఉన్న దృశ్యం

ఆటోలు, రిక్షాలు వేలం

ప్రజాశక్తి - ఉదయగిరి :స్థానిక గ్రామపం చాయతీలో ఆటోలు, రిక్షాలను వేలంపాట శు క్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహి స్తున్నట్లు ఇఒ పిఆర్ డి కరిముల్లా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు డివిజనల్ పంచాయతీ అధికారి వారి ఆధ్వర్యంలో వేలంపాట జరుగు తుందన్నారు. వేలంపాటలో గ్రామపంచాయతీలో ఖండమై పోయినటు వంటి చెత్త సేకరించి ఆటోలు రిక్షాలను వేలంపాట వేయబడును. ఆసక్తి కలవారు సదరు వేలంపాటలో పాల్గొని వేలం పాట పాడుకోగలరని కోరారు.

పేదలకు అందని వైద్యం

ప్రజాశక్తి-కావలి:కావలి ఏరియా వైద్యశాలలో పేదలకు వైద్యం అందడం లేదని పర్యవేక్షించాల్సిన కమిటీసభ్యులు చూస్తూ ఉంటున్నారని తెలుగుదేశం పార్టీ నాయకులు గుండ్లపల్లి మురళి యాదవ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక జర్నలిస్ట్ క్లబ్‌లో ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఓ పక్క రాష్ట్ర ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్యం అందించాలని కృషిచేస్తుంటే, అలానే కావలిఎమ్మెల్యేదగ్గుమా టి వెంకటకృష్ణారెడ్డి కూడాపేదలకు వైద్యులు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు జారీ చేస్తున్నా ఏరియా హాస్పిటల్ లో పేదలకు వైద్యం అందటం లేదన్నారు సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు.


మాట్లాడుతున్న సూపర్‌వైజర్

ప్రీ స్కూల్ కార్యక్రమాలు పాదర్శకంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-కోవూరు

అంగన్వాడీ కేంద్రాల్లో విద్యనభ్యసిస్తున్న చిన్నారులకు ప్రీ స్కూల్ కార్యక్రమాలను పారదర్శకంగా నిర్వహించేలా అంగన్వాడీ కార్యకర్తలు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ రాధిక అన్నారు. కోవూరులోని పెళ్లకూరు కాలనీ ప్రాంతంలో గురువారం కోవూరు సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రానికి వచ్చే ప్రతి చిన్నారి ఎత్తు, బరువులను ఖచ్చితంగా తూచి ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం ద్వారా వచ్చిన పౌష్టికాహారాన్ని గర్భవతులకు, బాలింతలకు క్రమం తప్పకుండా పంపిణీ చేసి పౌష్టికాహారంపై వారిలో మరింత అవగాహన పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో కోవూరు సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు ఉన్నారు.


పరీక్ష ప్యాడ్‌లు అందజేస్తున్న దృశ్యం

పరీక్ష ప్యాడ్లు బహూకరణ

ప్రజాశక్తి-కావలి: స్థానిక వెంగళరావు నగర్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గురువారం కావలి పట్టణంలోని ప్రముఖ కళాశాల శ్రీ చైతన్య జూనియర్ కళాశాల సౌజన్యంలో పదో తరగతి చదివే అరవై మంది విద్యార్థులకు పరీక్షలు రాసే ప్యాడ్లు, పెన్నులు తదితర కిట్లు ప్రధానోపా ధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో నూతన ప్రధానోపాధ్యాయులు వి.వెంకటేశ్వర్లు, టి.కొండారెడ్డి, అంజాద్ అలి, బి.శాంతకుమారి, బి.శర్వాణి,షేక్ సాబిరా బేగమ్ శ్రీ లక్ష్మీ, విజయలక్ష్మి రజని, షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

సంయుక్త సేవా సంస్థకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి-కావలి:విడవలూరు మండలం, వరిణి గ్రామానికి చెందిన అంధుడు పాటూరు. ధనుంజయ్యకి సంయుక్త సేవా సంస్థ 'జీవన జ్యోతి' విభాగం ద్వారా దాతల సహకారంతో నెల్లూరు శ్రీ శిరిడీ సాయి రూరల్ వెల్ఫేర్ మెడికల్ ఫౌండేషన్‌లో కంటి ఆపరేషన్ చేయించి చూపును ప్రసాదిం చారు.ఈ సందర్భంగా సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ అంధుడు ధనుంజయ్యకి గత12సంవత్సరాల క్రితం నుంచి రెండు కళ్లు కనిపించకుండా పోయా యన్నారు. ఆపరేషన్ చేయించుకునే స్తోమత లేక అనేక ఇబ్బందులు పడుతు న్నారని తన దృష్టికి వచ్చిందని చెప్పారు. ఈ విషయాన్ని తమ సంస్థ సభ్యులకు తెలియ జేశామన్నారు. (సంస్థ సభ్యులు ఆర్థిక సహాయం అందజేయడంతో ధనుంజయ్యకి ఆపరేషన్,చేయించానని తెలిపారు. సంయుక్త సేవా సంస్థ సభ్యులకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియ జేస్తూ ఉన్నామని తెలిపారు.


చెక్కు అందజేస్తున్న దృశ్యం

అదనపు తరగతి గదుల నిర్మాణపనులు

ప్రజాశక్తి-ఉదయగిరి:ప్రాథమికోన్నత పాఠశాల వెంకట్రావుపల్లి అదనపు తరగతి గదుల నిర్మాణానికి ప్రధానోపాధ్యాయులు ఎం. బలరామయ్య కి మండల విద్యాశాఖ అధికారులు షేక్ మస్తాన్ వలి, తోట శ్రీనివాసులు 2 లక్షల రూపాయలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూజిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టిఇఒ ద్వారా సమకూర్చిన 2 లక్షల రూపాయలు స్కూల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్మెంట్ నిధుల చెక్కులను ఈ సందర్భంగా అందజేశా మన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.